# మా సంసారంలో మహాప్రస్థానం

శశిధర్

ఈ వేళ ఆదివారం గనక భళ్లున తెల్లారి ఎనిమిది గంటలవుతూన్నా ఆయ నింకా నిద్దర్నించి లేవలేదు. వంటింట్లో గ్యాసు పొయ్యిమీద పాలల్లో కాఫీ డికా షను కలుపుతూ తలతిప్పి నేరుగా అగ పడుతూన్న బెడ్రూము వేపుచూసాను. ఆయన మంచంమీద బోర్లా పడుకుని గాఢంగా నిద్రపోతున్నారు చిన్న పిల్లా డిలా.

(ఏ మాట కామాటే చెప్పుకోవాలని రూలంటూవుంటే నిజం చెప్పేస్తున్నాను. పసి పిల్లాడిలా అమాయకంగా కను పిస్తూన్న ఆయన్ని ముద్దుపెట్టు కోవాలని పించిందంటే నమ్మండి.)

అలా నిద్రపోతూన్న ఆయన్నీ నన్నూ ఓ షాటులో చూపించి, తరువాతి షాటులో నేను పాలల్లో కలుపుతూన్న డికాషను గనుక యే సినిమాలో నన్నా చూపిస్తే ప్రేక్షకులు చప్పట్లు కొట్టకమానరు. అంటే ఆయన పాలవంటి వారనీ నేను డికాషన్లాటి దాన్ననీ నా(లోని దర్శకురాలి) వుద్దేశ్యం. ఆయన ఎమ్మే తెనుంగు. మరినేను ఒకటోక్లాసు ముందు లోయరూ అప్పరూ కే. జీలనుంచీ, బీ. యెస్సీ వరకూ (రెండు సబ్జక్టులున్నట్టున్నా యనుకోండి) పదహారణాల ఇంగ్లీషు మీడియం. అసలు పసితనం నించీ నేను తెలుగు అంటే మాకుక్కపిల్లని స్నానం చేయిస్తూన్నపుడు అది పెట్టే ముఖ భంగి మలు పెట్టేదాన్ని. ఇంగ్లీషంటే ప్రస్తుతం మావారిమీదలా అమితమైన ముద్దు. కానీ ఆయనకి పుట్టక ముందునుంచీ ఇంగ్లీ షంటే తగని చిరాకు. "ఈ ప్రపంచంలో పడి ఇంగ్లీషు మధ్య నే నెలా బ్రతకనురా భగవంతుడా" అనుకుంటూనే ఆయన పుట్టారనీ అందుకే పుట్టగానే క్యారు కాం మని ఏడ్చారనీ ఆయన చెబుతూంటారు. లాంగ్వేజి విషయంలో ఇంత డిఫరెన్సు వున్న మేము డికాషనూ, పాలూ కాకుండా ఎలా వుంటాం చెప్పండి. ఇవన్నీ అటుంచి, డికాషను పాలు కలిపి శ్రేష్టమైన కాఫీ తయారైనట్టే మా సంసా రమూ "ఓ హేపీహోం" కింద తయా రైంది. అందుకే ఎవరన్నా కొత్తగా పెళ్ళయిన వాళ్ళని "డికాషనూ పాలలా కలిసి పోయి ఆనందంగా జీవించండి" అని మనసారా దీవిస్తుంటాను నేను.

ఇలా ఆలోచిస్తూండగా స్టవ్వుమీది కాఫీ మరిగి పొంగిపోవడం చూసి ఈ లోకంలోకి వచ్చాన్నేను. (ఇందాక

చెప్పిన లైన్లలోనే ఇలా కాఫీ మరిగి పొంగి పోవడమూ కూడా చూపిస్తే దర్శకత్వం ఎలా వుంటుందన్న విషయం ఆలోచించరాదు.)

కాఫీ నొక కప్పులోకి వంచి ఆయన పడుకున్న మంచం దగ్గరి కెళ్లాను. నేనిలా కాఫీ తీసు కొస్తున్నట్టు ఆయనకి తెలిసినట్టుంది. దొంగ నిద్దరపోతూనే చిరునవ్వులు కురిపిస్తున్నారు

"మిమ్మల్నే" అన్నాను.

ఆయన మూసుకున్న కళ్ళతో నవ్వుతూనే.

"ఏవిఁటది" అన్నారు.

ఇంతవరకూ మా సంసారాన్ని డికాషనూ పాలూ కలిసిన 'కాఫీ'తో పోల్చుకుని దర్శకత్వం వహించుకున్న నేను.

"అదే మన సంసారం" అన్నాను.


"వాట్!" అంటూ వులికిపడి లేచి కూచున్నారాయన.

'అదేలెండి కాఫీ' అన్నాను ముసిముసి నవ్వులు పారబోస్తూ.

నా చేతిలోని కప్పు అందుకుని కాఫీ చప్పరించి, నా వేపు ప్రశంసా పూర్వకంగా చూస్తూ "వాఁ" అన్నారు.

"కాఫీ ఎలావుంది" అన్నాను పక్క మీదుగా జరిగికూచుంటూ ఆ యన శూన్యంలోకి చూస్తూ

"కాఫీ! ఓ కాఫీ! నా యువకాశల నవ



పేశల సుమ వంటింటావరణంలో నిను నే నొక సుముహూర్తంలో "

"బాబ్బాబు ఇక చాలు ఆపండి" అన్నాను నేను తల పట్టుకుంటూ.

(ఆయన కపుడపుడు ఇలా

శ్రీశ్రీ పూనుతుంటాడు. ఒకసారి వచ్చాడంటే త్వరగా వదల్డు మరి. నాకు తెలుగంటే అసహ్యమని తెలుసు గనక మరీ విజృంభించి పోతారాయన)

ఆయన నా మాట పట్టించుకున్నట్టు లేదు.

"వారెవా, పొద్దున్నే ఏం కాఫీ యిచ్చావు డియర్ ఇది తాగితే

"మరో ప్రపంచం, మరో ప్రపంచం,
మరో ప్రపంచం పిలిచిందీ.
పద డియర్ ముందుకు, పద
శ్రీమతి తోసుకు పదరాణీ పోదాం
పైపైకి కాఫీ తాగుతూ
పదంపాడుతూ వా్రెవా "

నాక్కోపం రెచ్చిపోయి దిగ్గునలేచి నుంచున్నాను.

"ఆగమ్మాయ్ పారిపోకూ" అంటూ నా కొంగు చేత బుచ్చుకు వెనక్కి లాగారు. ఆ వూపుకు వెనక్కెళ్ళి ఆయన ఛాతీమీద బోర్లాపడ్డ నన్ను గట్టిగా ఒడిసి పట్టుకుంటూ మొదట్లో పసిపిల్లాడిలా అమాయకంగా కనబడ్డపుడు నే చేద్దామనుకున్న పని చెయ్యబోయారు.

"వొదలండి పొద్దునే ఏవిటీ పని? మీ నోరు వాసనేస్తూంది" అన్నాను.

ఆయన కొంటెగా నవ్వుతూ "కాఫీ వాసనా" అన్నారు "కాదు శ్రీ. శ్రీ వాసన నేనది భరించలేను." అన్నా తప్పించుకోబోతూ.

నన్నాయన మరికాస్త గట్టిగా గుండెలకుహత్తుకుంటూ.

"ఉండాలోయ్ కవితావేశం. దొరకదటోయ్ శోభావేశం కవిత్వ మొకతీరని దాహం" అన్నారు నా పెదాల నందుకో బోతూ.

"అమ్మదొంగా పరగడుపున యీ పాడుపనులా" అని నేను మనస్సులో ఇంగ్లీషులో అనుకుని, ఆయన చేతుల్నించి విడిపించుకుని వంటింట్లోకి తుర్రుమన్నాను.

మా వారు నిరాశ చెందినట్టున్నారు.

"వేళకాని వేళలలో, లేనిపోని వాంఛలతో దారికాని దారులలో, కానరాని కాంక్షలతో దేనికొరకు పదేపదే దేవులాడు తావ్" అని.

శ్రీ శ్రీ భాషలోనే తనని తనే తిట్టుకుంటూ పేస్టు వేసుకుని బ్రెష్షుతో బాత్రూమువేపు నడిచారు. పళ్ళు తోముకోవడం పూర్తిచేసినా బాధతీరలేదేమో బాత్రూములోంచే.

"పతులార! భ్రష్టులార! బ్రతుకుకాలి పనికిమాలి.

దీనులార హీనులార ఏడవకండేడవకండీ" అని అరుస్తున్నారు.

"మరీ పసిపిల్లాడిలా బిహేవ్ చేస్తారు. అందునా ఆదివారమొస్తే పట్టపగ్గాలుండవు" నేను నవ్వుకుంటూ అనుకున్నాను పొయ్యిమీద పప్పుడకేస్తూ

ఈ లోగా స్నానంతోపాటూ మరో రెండు పెద్దవి శ్రీ శ్రీ గేయాలు పాడటం పూర్తిచేసి, మల్లెపువ్వులాంటి తెల్లటి పంచె కట్టుకుని వంటింట్లో కొచ్చారాయన.

వచ్చి వెనకనుంచి నా మీద చేతులు వేసి, పియర్స్ సోపు పరిమళాలతో నన్ను నింపేస్తూ "ఇపు దేవాసనొస్తున్నా"




అన్నారు చిలిపిగా.

నేను రవంత కోపం నటిస్తూ "మీ శ్రీ శ్రీ ముందు పది పియర్సు సోపులైనా పన్జెయవులెండి" అన్నాను

"మా గురూగారిని పరగడుపునే తిట్టినా కనవసరంగా కోపం తెప్పించకు దుష్టబాలికా" అన్నారు ఆయన చిరుకోపంతో. (బహుశా నటిస్తూనే)

"ఏం జేస్తారు" అన్నా తల ఎగరేసి.

ఆయన కామాటకి నిజంగానే కోపం వచ్చినట్టుంది. నన్ను ముందుకు తిప్పుకుని గట్టిగా కవుగలించుకుని గాఢంగా ముద్దు పెట్టేసుకున్నారు. నాకు అప్పుడు అమితంగా కోపం వచ్చేసింది. "మీ పంతవేఁ నెగ్గిందనుకోకండి" అని మనసులో అనుకుని ఆయన అందమైన క్రాపులోకి వేళ్ళుపోనిచ్చి ముందుకు లాక్కుని మరింత గాఢంగా మరో ముద్దు పెట్టుకున్నాను.

(ఇక్కడో విషయం వివరించాల్సి వుంది. ఏ సంసారపు జంటా 'ఒకముద్దు' పెట్టుకోకూడదని ఓ హేపీ హోము రూలుందట. అలా పెట్టుకుంటే ఆడపిల్లలు పుడతారన్న భయమూవుంది అలా ఆడపిల్లలు పుడితే ఇబ్బందేదీ లేకపోయినా, వాళ్ళందరూ రేపు రచయిత్రులైపోతే వాళ్ళకి కాగితవూఁ, పెన్నులు, ఇంకులూ, పోస్టేజి ఖర్చులూ సప్లయి చెయ్యాడవేఁ కష్టమని మా వారి ఆర్గ్యుమెంటు. పైగా ఒకముద్దే పెట్టుకుంటే అది పెళ్ళాంమొద్దో మొగుడి మొద్దో అవుతుంది. కనక ఇద్దరూ తమ తరపున చెరోటీ పెట్టుకు తీరాలన్నది మా బుల్లి సంసారంలో మేం పెట్టుకొన్న బోలెడన్ని రూళ్ళలో ఒకటి)

నేనిలా 'రెండు ముద్దులరూలు' గురించి మురిసి పోతూండగా సతీ సావిత్రి నాటకంలో మొండి సావిత్రి యంటీ రామారావుని అడిగినట్టుగా "ఒహటి నేనిస్తిని. మరోటి నీ వడిగితివి మరి ముచ్చటగా మూడోదేదీ" అన్నారు.

"మూడో దెందుకూ."

"అదికాదు డియర్, ఒకటి నీది, ఒకటి నాది. మరి శ్రీ. శ్రీ దేదీః"

"హమ్మా! ఈ మాటవింటే మీ శ్రీ. శ్రీ మీ మీదకి కోపంతో జగన్నాధ రథచక్రాల్ పంపిస్తాడు జాగర్త! ఈపప్పు లేవీ ఇక్కడ వుడకవు" అన్నాను స్టవ్వుమీద వుడుకుతూన్న పప్పును కలుపుతూ.

ఆయన తిరిగి నిరాశ చెందినట్టున్నారు.

"హాః ఏయింటి చరిత్ర చూపినా ఏ మున్నది గర్వకారణం.

పతి జాతి చరిత్ర సమస్తం సతిపీడన పరాయణత్వం!" అని వాపోయారు.

నేను ఆయన దుఃఖాన్ని పోగొట్టాలనీ (కనీసం అలా పోగొడితేనన్నా శ్రీశ్రీ గేయా లాగిపోతాయేమోనన్న సదుద్దేశ్యంతో)

"మార్నింగ్షోకెళుతున్నాను, పది గంటలకి. మీరీ వంటపని చూసుకోండి" అన్నాను.

ఆయన అసంతృప్తికి ఆజ్యం పోసి నట్టయింది.

"పోనీ, పోనీ పోతే పోనీ
సతుల్, సుతుల్, హితుల్
పోనీ, పోతేపోనీ, పోనీ!" అన్నారు పాటరూపంలో.

ఆ పాట వింటూ కూచుండగా పొయ్యి మీద పెట్టిన పప్పు మాడిపోయి పొగలు వచ్చాయి.

అది గమనించి ఆయన కంగారుగా అటువేపు చూపిస్తూ "చూడు చూడు నీడలు—నీడలు పొగమేడలూ" అనరిచారు.

నేను పప్పుగిన్నె దింపి గిన్నెలోకి చూసాను. లోపల కనుపించిన వస్తువు సంవత్సరానికి సరిపడే కాటుకలా అగుపించింది అది చూసి నా కేడుపొచ్చినంత పనయింది.

"వెధవది. ఇవాళ ఆదిలోనే హంస పాదుపడిందే. ఇహ మిగతావన్నీ ఎలా పూర్తి చేయాలి" అన్న ఆలోచన వచ్చి బోలెడంత నీరసం ఆవహించింది.

"పోనీ, కానీవోయ్ రసనిర్దేశం!" అన్నారు.

"ఇపుడు నేనా రసాలూ, సాంబార్లూ పెట్టలేను" అన్నాను విసుగ్గా.

అందుకాయన నవ్వుతూ చెయ్యి పుచ్చుకుని "పెళ్లాం ఓ పెళ్ళాం! నా యువ కాళల నవపేశల సుమగీతావరణంలో నిను నేనీ సుముహూర్తంలో "అంటూ ఆపి ఆపై గుర్తుకాక "పద త్వరగా డ్రెస్సవ్వు మార్నింగ్షో కెళ్ళి, ఆ తర్వాత హోటల్లో భోజనం చేసొద్దాం" అన్నారు.

ఏ మాట కామాటే చెప్పాలన్న రూలుంటే నిజం చెప్పేస్తున్నాను. నాకా క్షణం శ్రీశ్రీ అంటే ఎపుడూ లేనిది, బోలెడంత ప్రేమ పుట్టుకొచ్చిందంటే నమ్మండి.

(శ్రీశ్రీకి క్షమాపణలతో)

★